క్లుప్తంగా

నెట్టికంటుడి సేవలో విజయవాడ డీసీపీ



డీసీపీ ఉదయరాణికి తీర్థ ప్రసాదాలను అందజేస్తున్న అర్చకులు

గుంతకల్లు రూరల్: విజయవాడ సిటీ డీసీపీ ఉదయరాణి శనివారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ఆమెకు తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

పన్ను వసూలుకు కృషి చేయండి



యల్లనూరులో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ

యల్లనూరు/పుట్లూరు: పన్ను వసూలుకు కృషి చేయాలని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమ సూచించారు. యల్లనూరు మండల కేంద్రంలోని గ్రంథాలయ శాఖను ఆమె శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. సౌకర్యాలపై లైబ్రేరియన్ ప్రకాష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. లైబ్రరీ మెంబర్‌షిప్, సెస్ వసూలుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠకులు, సిబ్బంది రామచంద్ర పాల్గొన్నారు. అలాగే ఆమె పుట్లూరు మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జయరాములు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న సీడీపీఓ ఢిల్లీశ్వరి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లిలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సీడీపీఓ ఢిల్లీశ్వరి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహార పంపిణీపై ఆరా తీశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి ఉంచాలని కార్యకర్తలను ఆదేశించారు. సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని సీడీపీఓ హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ఉన్న బ్యూటీషియన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్–స్కూటీ ఢీ: ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని జెండా వీధి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వన్నేదొడ్డికి చెందిన నారాయణ బైక్‌లో గుత్తికి బయలు దేరాడు. జెండా వీధి సమీపంలో జయ అనే మహిళ స్కూటీలో రోడ్డు క్రాస్ చేస్తుండగా నారాయణ బైక్ ఢీ కొంది. ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆటోలో వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

జగ్గుల ప్రకాష్ మాదిగకు నివాళి



ప్రకాష్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దపప్పూరు: మండలంలోని మాదిగ జాతి అభివృద్ధికి పాటు పడిన జగ్గుల ప్రకాష్ మాదిగకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పెద్దపప్పూరు మండల కేంద్రంలోని శ్రీకృష్ణస్వామి దేవాలయంలో జగ్గుల ప్రకాష్ ఐదో వర్ధంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పసల కంబగిరి మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ టీ ఆదినారాయణ తదితరులు జగ్గుల ప్రకాష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు తబ్బుల రామాంజనేయులు, ఇన్‌చార్జి నాగ సుబ్బరాయుడు, నాయకులు శ్రీనివాసులు, కొట్టాలపల్లి రామాంజినేయులు, చాగల ఆదినారాయణ, నాగభూషణం, రామాంజనేయులు, శివ, మల్లికార్జున, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి



తాడిపత్రిలో చలికాచుకుంటున్న దృశ్యం

- ఇబ్బందులు పడుతున్న దీర్ఘకాలిక రోగులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు



యల్లనూరులో మంచు ఇలా..

తాడిపత్రి రూరల్/యల్లనూరు: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల ప్రాంతంలో రోజు రోజుకూ చలి తీవ్రత పెరుగుతోంది. రాత్రి సమయంలో ఉష్ణోగ్రత 15 డిగ్రీలకు పడిపోతోంది. ఉదయం 8 గంటల వరకూ పొగ మంచు చుట్టుకుపోతోంది. సాయంత్రం ఐదున్నర గంటల నుంచే శీతల గాలులు వీస్తున్నాయి. ఆరు గంటల నుంచి చలి ప్రభావం ఉంటోంది. గత నాలుగైదు రోజులుగా 20 కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదు అవుతుండటంతో ప్రజలు రాత్రిపూట, తెల్లవారుజామున బయట అడుగు పెట్టలేకపోతున్నారు. శీతలగాలులకు వ్యాధులు పొంచి ఉన్నాయని వైద్యులు అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వివిధ రకాల పంటలు, పండ్ల తోటల నుంచి పందులు, జింకలు, ఇతర జంతువుల నుంచి కాపాడుకునేందుకు రైతులు కాపలాగా ఉంటున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో పొలాల వద్ద చలి మంటలతో వెచ్చపడుతున్నారు. నవంబర్‌లోనే ఇలా ఉంటే డిసెంబర్, జనవరి నెలల్లో ఏ స్థాయిలో చలి ఉంటుందన్న భయం వారిలో వ్యక్త మవుతోంది.

జాగ్రత్తలు తీసుకోవాలి

చలి తీవ్రత ఎక్కువ అవుతుండటంతో దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. థైరాయిడ్, బీపీ, షుగర్, అస్తమా, సీఓపీడీ, టీబీ తదితర రోగాలతో బాధపడే వారు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. రాత్రి సమయాల్లో బయట తిరగరాదు. చలి ఎక్కువగా ఉండటం వల్ల జలుబు, జ్వరం, దగ్గు తదితర రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నాయి. చలి గాలుల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చిన్న పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు స్వెట్టర్లు వాడటం తప్పనిసరి చేసుకోవాలి. ఉదయం పూట వాకింగ్‌ను సాధ్యమైనంత వరకు విడిచి పెట్టాలి. మంచు నేపథ్యంలో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది.

ఆస్పత్రులు కిటకిట

చలిగాలుల కారణంగా రోగుల శాతం పెరుగుతోంది. దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారితోపాటు జలుబు, జ్వరం, దగ్గు తదితర రోగాలతో ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. వృద్ధులు, చిన్నారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంటోంది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే రోగులతో తాడిపత్రి పట్టణ ఆస్పత్రులు నిండిపోతున్నాయి. దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు అనంతపురం ప్రభుత్వాస్పత్రితోపాటు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. రోగాల తీవ్రతను బట్టి ప్రజల జేబులు గుల్లవుతున్నాయి.

పెరుగుతున్న వాయు కాలుష్యం

తాడిపత్రి ప్రాంతంలో రోజు రోజుకూ పెరుగుతున్న వాయు కాలుష్యంతో దీర్ఘకాలిక రోగుల సంఖ్య పెరుగుతోంది. తాడిపత్రి ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీలతో పాటు స్టీల్ ప్లాంట్ తదితర ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి ద్వారా వాయు కాలుష్యం అధికమవుతోంది. తాడిపత్రి పారిశ్రామికంగా అభివృద్ధి చెండడంతో రోజూ వందలాది లారీలు సిమెంట్, ఇతర సామగ్రిని తరలిస్తున్నాయి. తాడిపత్రి ప్రాంతంలో ద్విచక్ర వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది. మూడు జిల్లాల కేంద్రంగా తాడిపత్రి మారడంతో వాహనాల సంఖ్య పెరిగి వాయు కాలుష్యం వెదజల్లుతున్నాయి. వీటి కారణంగా దుమ్ము, ధూళి పెరిగి వాటిని పీల్చుకుంటున్న ప్రజలు వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారు. ప్రధానంగా శ్వాసకోశ వ్యాధుల బారిన ఎక్కువ మంది పడుతున్నారు.

చలి గాలులు వీస్తున్నాయి



రోజు రోజుకూ చలి గాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. రాత్రి సమయాల్లో బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉంటోంది. చలి గాలులకు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. చలి కారణంగా రోగాలు రాకుండా జగ్రత్తలు తీసుకుంటున్నాం.

– శివశంకర్‌రెడ్డి, తాడిపత్రి

జాగ్రత్తగా ఉండాలి



శీతల గాలుల తీవ్రత పట్ల చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలి. దీర్ఘకాలిక రోగాలైన థైరాయిడ్, బీపీ, షుగర్, అస్తమా, సీఓపీడీ, టీబీ తదితర రోగాలతో బాధపడే వారు అప్రమత్తంగా ఉండాలి. ఉపిరి తిత్తుల వ్యాధితో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవాలి.

– అనిల్ కుమార్‌రెడ్డి, వైద్యుడు

వైద్యులను సంప్రదించాలి



జలుబు, దగ్గు జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. చలికాలంలో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు అధికం. రోజులో ఉదయం, సాయంత్రం 30 నిమిషాల పాటు సూర్యకాంతి పడేలా చూసుకోవాలి.

– శ్రీనాథ్‌రెడ్డి, వైద్యుడు, యల్లనూరు

నీరు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యూడెమొక్రసీ పార్టీ నాయకులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శివారు కాలనీల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా తరలించాల్సిన నీటిని పెద్ద హోటళ్లు, లాడ్జిలు, అపార్ట్‌మెంట్‌లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఇంజినీరింగ్ అధికారులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సూర్యవర్ధన్‌పై చర్యలు చేపట్టాలని కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్టీ నాయకులు కోరారు. శనివారం కమిషనర్‌ను ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి.సురేష్ తదితరులు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టకపోతే ఆందోళనలు చేపడతామన్నారు. తాగునీటి పైప్ లైన్‌ల మరమ్మత్తుల పేరిట వారంరోజులు గడిచినా ప్రజలకు నీటిని సరఫరా చేయడంలో అధికారులు విఫలం చెందారన్నారు. కార్యక్రమంలో న్యూడెమొక్రసీ పార్టీ నాయకులు సత్తార్, రఘునాథరెడ్డి, జిలాన్, రామాంజినేయులు, బాష తదితరులు పాల్గొన్నారు.

గురజాడ అప్పారావుకు నివాళి



గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో శనివారం గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు అబూ బకర్, నాయకులు కుళ్లాయి బాబు, రామ్మోమన్, వెంకటేష్ , శామ్యూల్ తదితరులు గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు గురజాడ అప్పారావు గొప్పతనం, జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో పెన్షనర్లు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక పూజలు



గుంతకల్లులోని బుగ్గ సంగమేశ్వర ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

గుంతకల్లు రూరల్: కార్తీక మాసం చివరి శనివారం మండలంలోని బుగ్గ సంగమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, భక్తులు ఆలయ ఆవరణలో కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని శివాలయాల్లో కార్తీక శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కాశీ విశ్వేశ్వర దేవాలయం, నగరేశ్వరాలయం, నాగలింగేశ్వరాలయం, అయ్యప్ప ఆలయం, గౌతమేశ్వరాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల ఆవరణలో మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే గుత్తి ఆర్‌ఎస్‌లోని నవరూప ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు, హహిళలు పూజలు నిర్వహించారు.

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో శనివారం ముగిసిన కార్తీకమాస అమావాస్య పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధ్వజ స్తంభానికి ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు చంద్రాశర్మ, అనిల్ వేదమంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తిప్రపత్తులతో ధ్వజ స్తంభం చుట్టూ దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.



పామిడి భోగేశ్వరాలయ ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న దృశ్యం



గుత్తి ఆర్‌ఎస్‌లోని నవరూప ఆంజనేయస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన దృశ్యం

స్పేస్ రీసెర్చ్‌కు ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థి



ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందిస్తున్న కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్‌ఆర్‌డీటీ, ఆర్‌టీఎంజీ, ఎంఐఎస్‌ఏ పోగ్రాం ద్వారా ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో ప్రతిష్టాత్మకమైన ఇంటర్న్‌షిప్‌ను చేపట్టేందుకు ఎంపికైనట్లు కరెస్పాండెంట్ ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్న కోటీశ్వర్ అహ్మదాబాద్‌లోని స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఏసీ)లో ఇంటర్న్‌షిప్ చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, మెకానికల్ విభాగం అధిపతి డాక్టర్ వంశీక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జోనల్ పోటీలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో అధికారులు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆర్డీటీ సౌజన్యంతో శనివారం జోనల్ లెవల్ రూరల్ అండర్–13 మిక్స్ జెండర్ సాఫ్ట్‌బాల్ లీగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. పోటీలకు అనంత సాఫ్ట్‌బాల్ క్లబ్, కడవకల్లు సాఫ్ట్‌బాల్ క్లబ్, బుక్కరాయసముద్రం సాఫ్ట్‌బాల్ క్లబ్, కురుగుంట, తాడిపత్రి, క్లబ్ సాఫ్ట్‌బాల్ క్లబ్‌ల మధ్య లీగ్ పద్ధతిలో టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ గ్రాస్ రూట్ లెవల్ కోఆర్డినేటర్ వంశీక్రిష్ణ మాట్లాడుతూ ఈ పోటీల్లో విన్నర్, రన్నర్ జట్లు డిసెంబర్ 4, 5న జరిగే సెంట్రల్ లెవల్ పోటీలకు అర్హత సాధిస్తాయన్నారు. జోన్–3 విన్నర్స్ బీకేఎస్ సాఫ్ట్‌బాల్ క్లబ్, రన్నర్ అనంత సాఫ్ట్‌బాల్ క్లబ్ సాధించారన్నారు. కార్యక్రమంలో ఫిజియో థెరఫిస్ట్ అశోక్, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నాగరాజు గౌడ్, పీఈటీలు విద్యార్థులు పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు !



రోడ్డుకు అడ్డంగా తీసిన గుంత

యల్లనూరు: మండల కేంద్రంలోని పాతపేటలో ప్రధాన రోడ్డు పక్కనే టెలికాం అధికారులు పెద్ద గుంత తీశారు.. మరిచిపోయారు. దీంతో యల్లనూరు– సింహాద్రిపురం ప్రధాన రహదారి కావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ గుంతలో పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. ఆటోలు, జీపులు, ద్విచక్రవాహన యజమానులు నానా తంటాలు పడుతున్నారు. బస్సులు, ఇతర వాహనాలు నిత్యం తిరిగే రహదారి కావడంతో ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. టెలికాం అధికారులు స్పందించి గుంతకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం’

గార్లదిన్నె: మండలంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల పేద రైతుల భూ సమస్యలు పరిష్కారం కావడం లేదని గ్రామీణ పేదల సంఘం జిల్లా కన్వీనర్ నాగభూషణ, మండల నాయకులు ఓబిలేసు, క్రిష్టప్ప మండిపడ్డారు. శనివారం వారు మాట్లాడుతూ యర్రగుంట్ల గ్రామంలో భూ సమస్యను రెవెన్యూ అధికారులు పరిష్కరించకపోవడంతో రెండు కుటుంబాల రైతులు ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి రైతుల భూ సమస్య పరిష్కరించాలని, లేని పక్షంలో గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

యాడికి: మండల కేంద్రంలోని కోట వీధిలో నివసిస్తూ పౌరోహిత్యం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రామేశ్వరయ్య శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్య , కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న పాండురంగయ్య, చంద్రయ్య, మద్దాల నారాయణస్వామి, ప్రదీప్, శేఖర్, సుబ్రమణ్యం, గోపి, రంగయ్య, మంజునాథ్, పవన్ తదితర ఆర్యవైశ్యులు రూ.12 వేలు ఆర్థికసాయం అందించారు. అలాగే యాడికి బ్రాహ్మణ సంఘం సభ్యులు, చెన్నకేశవ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. గాదం శెట్టి బలరామయ్య, శ్రీధర్, శేఖర్‌తో పాటు మే ఐ హెల్ప్‌యూ పొందే సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

గుంతకల్లు: పట్టణంలోని కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు శనివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన స్టార్ హాస్పిటల్స్ వైద్యులు హాజరవుతారన్నారు. శిబిరంలో ఆర్‌బీఎస్, బీపీ చెక్, ఈసీజీ, 2డీకో, లివర్ స్కాన్, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు. అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

4న బియ్యం, బేడల వేలం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్రంలో డిసెంబర్ 4న బియ్యం, బేడల వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రమణ్యం శనివారం తెలిపారు. బియ్యం, బేడల వేలంలో పాల్గొనే వ్యాపారులు రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే క్షేత్రంలో వివాహాది శుభకార్యాలకు వంట సామగ్రి, ఇతర సామాన్లను అద్దె ప్రాతిపదిక సరఫరా చేయడం కోసం వేలంలో పాల్గొనే వారు రూ.5 వేలు చెల్లించాలన్నారు.

నేడు పేదల గ్యార్మీ పండుగ

పామిడి: పట్టణంలోని పాతబస్టాండ్ దర్గా వద్ద గౌసే ఆజాం జెండా కట్ట ఆధ్వర్యంలో ఆదివారం పేదల గ్యార్మీ పండుగ నిర్వహించనున్నట్లు ఆ జెండా కట్ట సభ్యుడు సీ సాదక్‌వలి శనివారం తెలిపారు. 30 రోజుల గ్యార్మీ నెల చివరి రోజు పేదల గ్యార్మీ నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆ రోజు ఫాతెహా అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

మజ్దూర్ యూనియన్ ప్రచారం



గుత్తి ఆర్‌ఎస్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మజ్దూర్ యూనియన్ నాయకులు

గుత్తి: డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో రైల్వే సంఘాల గుర్తింపు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు, కార్మికులు శనివారం గుత్తి ఆర్‌ఎస్‌లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ డివిజన్ కార్యదర్శి విజయ్ కుమార్, ఏడీఎస్ అశ్వని, నారాయణ, కోశాధికారి శర్మ, బ్రాంచ్ నాయకులు రామాంజుల రెడ్డి, శేఖర్‌బాబు, మనోహర్‌బాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్మికులు విస్తృతంగా ప్రచారం చేశారు. జెండా గుర్తుకు ఓట్లు వేసి వేయించి మజ్దూర్ యూనియర్ ప్యానెల్‌ను గెలిపించాలని కోరారు. కాగా ప్రధాన పోటీ మజ్దూర్ యూనియన్, ఎంప్లాస్ సంఘ్ మధ్య నెలకొనింది. ఇతర సంఘాలు కూడా పోటీ పడుతున్నాయి. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.


దైవభక్తి అలవర్చుకోవాలి



భజన బృందం కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

పామిడి: ప్రతి ఒక్కరూ దైవభక్తి అలవర్చుకోవాలని పామిడి ఆలయాల సేవకుడు, కవి కే నారాయణమూర్తి అన్నారు. కార్తీక మాసంలో స్థానిక భోగేశ్వరాలయంలో భజనబృందం కళాకారుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భజన చేయడం ద్వారా దైవచింతన పెంపొందుతుందన్నారు. అనంతరం ఆలయ ఈఓ ఏ క్రిష్ణయ్య ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు దేవగుడి రామేశ్వరశర్మ సమక్షంలో హార్మోనిస్టు రామకృష్ణ, భజన సంఘం అధ్యక్షుడు పూల ఓబులేసు సారథ్యంలోని భజన బృందం కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నారాయణమూర్తి, వెంకట్రాముడు, అర్చకులు చంద్రాశర్మ, అనిల్, భక్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

గుత్తి: రంగోలి పోటీల విజేతలకు వైద్యులు బహుమతులందజేశారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగోలి పోటీలు నిర్వహించి విజేతలకు డాక్టర్ ఎల్లప్పతో పాటు వైద్యులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.